


ముందు జాగ్రత్తలు

ఎడం ప్రక్కనే నడువు. రోడ్డు దాటేటప్పుడు అన్నివైపులా శ్రద్ధగా చూడు. అయిదు నిమిషాలు లేటయినా ఫర్లేదుగానీ, రద్దీ తగ్గగానే రోడ్డు దాటు. బస్సులో కూచొని చేతులు బయట పెట్టొద్దు. కదుల్తున్న బస్సుల్లోంచి దిగొద్దు. పరీక్షకి వెళ్ళేటప్పుడు రెండు పెన్నులు తీసుకెళ్ళు. రైళ్లో పిల్లల్తో ప్రయాణం చేయవలసినప్పుడు మరచెంబుతో నీళ్ళు తీసుకెళ్ళండి, మరచిపోవద్దు. దూరప్రయాణం చేయవలసివస్తే డబ్బుతోపాటు ఉంగరమో, వాచీనో పెట్టుకుని వెళ్ళు. చీకట్లో నిద్రపోవద్దు. ఇట్లా ఎన్నెన్నో కాషన్లు పాటించవలసిన అవసరం మన కెంతయినా వుంది. ఏ క్షణం ఎట్లా రూపు దాల్చుతుందో అనూహ్యం గనక ఈ సూత్రాలను పకడ్బందీగా అనుసరించవలసి ఉంది.

నేనెప్పుడు ప్రయాణం చేసినా సీసాలో నీళ్ళు పట్టుకుని దగ్గరుంచుకుంటాను. అట్లాగని దారిపొడుగునా నీళ్ళు తాగమంటానని చెప్పడంకాదు. ఆమాటకొస్తే దార్లో బిరడా ఛస్తే తీయను. మూత పెట్టిన సీసా మూత పెట్టినట్లే ఉంటుంది. చివరికి మొత్తం నీళ్ళు హోటల్ బాత్రూమ్‌లో వంపేయడమే జరుగుతుంది. ఇంతమాత్రం దానికి మోతబరువెందుకని తమరడగవచ్చు. అది నా ముందు జాగ్రత్త. దార్లో దాహం వేసినా వల్లేదు. నీళ్ళున్నాయనే ధైర్యంకోసం నేను నీళ్ళసీసా పట్టుకెళ్ళుతుంటాను.

ఆ మధ్య మూర్తి మరచెంబుతో బస్సుదిగి హల్లో అన్నాడు. మంది మార్బలం వున్నప్పుడు మరచెంబ్ అవసరమంటే వప్పుకుంటాను. అంతేగాని లింగులిటుకుమంటూ ఒంటరిగా ప్రయాణంచేసే కె. వి. మూర్తి మరచెంబు ఎందుకు మోసుకొచ్చేడో మొదట్లో కనుక్కోలేకపోయాను. ఆ తర్వాత తెలిసింది-అందులో విస్కీ తీసుకు వచ్చినట్టు. రైల్లో ఏమోగాని బస్సులో పదిమంది ముందు మందేసుకోవడం మర్యాదగా వుండదని, సీసాలో పోసుకువస్తే రంగు బయట పడుతుందని మరచెంబుని పట్టుకున్నాట్ట. రైట్లొస్తేనప్పుడు మరచెంబు ఎత్తి గొంతు తడుపుకుంటూ వచ్చేన్నాడు. నార్కెట్‌పల్లిలో ఎవరో ముసిలావిడ కొంచెం నీళ్ళిప్పింగునాయనా అని అడిగితే ఈ నీళ్ళు మీకు పడవులెండి బామ్మగారూ! అదిగో అక్కడ హోటలుంది. వెళ్ళి తాగండనే మాటని తిప్పితిప్పి అరగంట చెప్పినప్పుడు ఇతగాడు తాగేది నీళ్ళుకావని బస్సంతా అర్థం చేసుకున్నారట. అంతేగాని అతని ముందు జాగ్రత్తని ఎవరూ మెచ్చుకోలేదని చాలా దిగులుగా చెప్పేడు.

తినబోయే పెసరట్ ఇట్లావుండాలి అట్లావుండాలి, అని ఎన్నెన్నో వర్ణించుకుంటూ సర్వర్‌కి చెప్పుకుంటాం. అన్నీ శ్రద్ధగానే వింటాడు. వినడం అయిపోయింతర్వాత పెసరాట్ అని పొలికేకపెట్టి కాషన్నీ గాలికొదిలి వెళ్ళిపోతాడు. జీలకర్ర కరణంగారని మా ఫ్రెండుకో మావగారున్నారు. ఆరోగ్యసూత్రాల పట్ల ఆయనకెంతో వల్లమాలిన అభిమానం. పొరుగూరు కెళ్ళేప్పుడు తనకూడా జీలకర్ర పొట్లాం, నేతి సీసా తీసుకుపోతుంటాడు. అదెంత గొప్ప హోటలయినా కావచ్చు, పదార్థాలు వెన్నకాచిన నేతితో చేయడని ఆయనకో చెడ్డ అనుమానం. అందువల్ల ఆయన

సర్వర్ని పిలిచి నేతి సీసాని, జీలకర్ర పొట్లాన్ని చేతిలో పెడతారు. ఆ రెండూ తప్పనిసరిగా ఉపయోగించి పెసరట్టు చేయించి తీసుకురమ్మని సర్వర్ని బతిమాలి వంటగదిలోకి పంపుతారు. ఆయన చాదస్తంగాని, ఎంత మంచి సర్వరుకైనా ఈ వరస చూస్తుంటే వళ్ళుమండదూ.

నేనెప్పుడు మదరాసు వెళ్ళినా, నాకక్కడ హోటల్ తిండి సౌకర్యంగా వుండదని గోంగూరతో కలుపుకుని మూడురకాల పచ్చళ్ళు మూడుసీసాల్లో స్టి బేస్కెట్‌లో పెడుతుంది మా ఆవిడ. మదరాసులో అడుగు పెట్టగానే ఆ సీసాలు మూడింటిని చెక్కబీరువాలో తోసేసి నాన్‌వెజిటేరియన్‌కి ఆర్డరివ్వడం నా అలవాటు. మళ్ళా ఏం మోసుకుపోతామనే ఉద్దేశ్యంతో తిరుగు ప్రయాణంలో పచ్చళ్ళ సీసాలు అరవ దేశానికి అంకితం చేసేసి రావడం తప్పనిసరి. పచ్చళ్ళు తినలేదంటే మా ఆవిడ ఏమనుకుంటుందోనని దోసావకాయ అదరగొట్టేసేవోయ్! బ్రహ్మాండంగా కుదిరింది. సగం కంచం ఆ అయిటమ్‌తోనే లాగించేవాడ్ని అంటూ కోతలు కోస్తున్నప్పుడు ఆవిడ చిన్నబుచ్చుకోడం కూడా మామూలే. దోసావకాయ అసలు చేయలేదని ఆవిడ చెప్పినపుడు నా ఉలికిపాటు యింతా అంతా కాదు. కనకేమిటంటే ముందు జాగ్రత్తలు, క్రమశిక్షణ పాటించిన పౌరులకు ఏమాత్రం వర్తించవని యిందు మూలంగా తెలుసుకోవచ్చు.

కూచోకుండానే బేరర్ని నిలబెట్టి ఆలూ మటన్ ఏవిధంగా ప్రిపేర్ చేసి తీసుకురావాలో అక్షరం మరచిపోకుండా చేతులు తిప్పుకుంటూ వర్ణించుకుంటూ చెబుతాడు ఆచారి. మందుకొచ్చి ఫుడ్డుమీద శ్రద్ధేమిటని అంటే వినిపించుకోడు. ఆలూ మటన్‌మీద మీటింగు పూర్తయిం తర్వాత మందుకి ఆర్డరు యిస్తాడు. రెండు గుటకలు పడంగానే చుడ్వా మీద దాడిచేస్తూ ఓహో, ఆహో అంటాడు. ఇక అక్కడ్నుంచి ఏ పదార్థం నోట్లోకి వెళ్ళినా బ్రహ్మాండమంటాడు. ఉప్పుగడ్డని కూడా అద్భుతంగా ప్రిపేర్ చేసేవని మెచ్చుకుంటాడు. ఆ తర్వాత వచ్చే అతని అభిమాన పాకం ఆలూ మటన్ అధ్వాన్నంగావున్నా పట్టించుకోడు. ఆచారి వ్యవహారం తెలిసిన బేరర్లు అతని ముందు జాగ్రత్తలకు బొత్తిగా విలువ యివ్వకపోవడం శోచనీయమే మరి.